

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## సంధ్యా సమస్యలు

**సెకండ్ కప్ కాఫీ షాప్!**

నలుచదరంగా ఉన్న ఆ కాఫీ బార్‌లో నాలుగు గోడలకి సగానికి పైగా ట్రాన్స్‌పరెంట్ అద్దం ఉండటంతో బయటి ట్రాఫిక్, లేక్, కిచెన్, దూరంగా స్కై స్క్రేపర్స్ కనబడుతున్నాయి.

కుడివైపు టేబుల్ ముందు కూర్చున్న దియా మరోసారి అసహనంగా ఫోన్ వైపు చూసింది. షాన్‌నించి మెసేజేం లేదు. అతని ప్రొఫైల్ పిక్చర్‌లో అతని ఫోటోకాక మువ్వలు వేలాడుతున్న అందమైన మురళి ఉంది. శ్యాం సుందర్ అనే పేరుని షాన్‌గా మార్చుకున్నా కృష్ణుడి పిల్లనగ్రోవిని మాత్రం ప్రొఫైల్‌గా పెట్టుకున్నాడు.

ఆమె దృష్టి దానిమీద పడింది.

"దరిద్రుడికి టేస్ట్ బానే ఉంది కాని ఆడపిల్లని అర్థం చేసుకునే మనసులేదు" తిట్టుకుంది.

'వేరార్యూ డార్లింగ్' అరడజను ముద్దులతో మెసేజ్ పంపింది. సమాధానం లేదు.

వెధవ! చూసుకోడు. ఎప్పుడూ ఏదో లోకంలో ఉన్నట్లు ఉంటాడు. తన మీద అసలు అంత కోపం వస్తుందని అనుకోలేదు. అప్పటికీ ఇంటికి వెళ్ళినప్పుడల్లా అమ్మ హెచ్చరిస్తూనే ఉంటుంది. 'నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నావ్. కంట్రోల్ ఉండాలి. మేమంతా అనలేక కాదు. తర్వాతి పరిణామాలు ఊహించి మౌనంగా ఉంటాం. నువ్వేదో గొప్పదానివైనట్లు ఏదీ మనసులో దాచుకోను అంటావు. అది గొప్పకాదు. ఇప్పుడనే మాట ఆర్నెల్ల తర్వాత అనాలి అని పెద్దవాళ్ళు చెప్తారు..'

సోది చెప్పవాకు అని ఒక్క మాటతో అమ్మ నోరు మూయించింది. మరి వీడి నోరు తెరిపించేదెలా?

విసుగ్గా వెళ్ళి ఇంకో కాఫీ తెచ్చుకుంది.

'ఐనా తనేం అంది? చాలా చిన్నమాట. మీ నాన్న ఫుల్ ఏక్టివ్‌గా ఉంటారు. మీ ఇంటికి వస్తే సరదాగా మాట్లాడతారు. నువ్వేమో మీ అమ్మలాగా ఎప్పుడూ మూతి ముడుచుకుని కూర్చుంటావ్. అసలు నువ్వు మీ నాన్నకే పుట్టావా?' అన్నది.

ఆ చిన్నమాటకి చివాలున లేచి పోయాడు. అప్పటినించి ఫోన్ లేదు. మెసేజ్ లేదు. డొక్కు మొహం గాడు. వీడేం అందగాడనా వీడి వెంట పడేది? వీడి బాబుకున్న ప్రాపర్టీ చూసి. బాయ్‌ఫ్రెండ్ అంటే ఎలా ఉండాలి? ఓ సరదా లేదు. పాడు లేదు. లివింగ్ టుగెదర్ ఉందాం అంటే పక్కలో పామున్నట్లుగా ఉలిక్కిపడ్డాడు. ఇలాంటి వాళ్ళని లెఫ్ట్ లెగ్‌తో తన్ని వదిలేయాలి. కాని వాడి వెనకున్న కోట్లు కాళ్ళు కట్టేస్తున్నాయ్.

దియా నిట్టూర్చి చుట్టూ చూసింది. దాదాపు నలభై సీట్లున్నా ఇరవైమంది దాకానే ఉంటారు. చాలామంది ఎవరితోనో వచ్చారు. వంటరిగా వచ్చినవాళ్ళు తక్కువ.

ఆమె దృష్టి మూడు టేబుల్స్ అవతల కూర్చున్న ఆకుపచ్చ చీరలోని అమ్మాయి మీద పడింది.

ఎంత బాగుందో 'మరువంతో  కట్టిన మల్లెపూదండలా' ఉంది అనుకుంది. ఆమెకి నవ్వొచ్చింది. ఈ షాన్‌గాడి భావుకత్వం తనకీ అంటుకుంది.

ఎప్పుడు వచ్చిందో చూడలేదు. తన గోలలో తనుంది. ఆ అమ్మాయి నెమ్మదిగా కాఫీ తాగుతూ ఏదో ఇంగ్లీష్ పుస్తకం చదువుకుంటోంది. ఆమె టేబుల్ శుభ్రంగా ఖాళీగా ఉంది. దియా తన టేబుల్ వైపు చూసింది.

అరడజన్ కాఫీ మగ్స్ చారలు పడి, కాఫీ చుక్కలు పడి, తిన్న పేస్ట్రీల తునకలు పడి నానా కంగాళీగా ఉంది. ఆ అమ్మాయి ఫస్ట్ కాఫీ తాగుతుందేమో అనుకుంది.

కానీ ఆ అమ్మాయి తన కప్ ఖాళీ అవగానే వెయిటర్ వంక చూసి సైగ చేసింది. అతను ఖాళీ కప్‌ని తీసుకెళ్ళి రెండు నిమిషాల్లో నిండు కప్‌తో వచ్చాడు.

అలా వెంట వెంటనే టేబుల్ క్లీన్ చేస్తే లెక్క తెలీదని దియా వాటిని అలాగే ఉంచేస్తుంది. 'ఐదు కప్పులు తాగితే వాడు ఆరని చెప్పి డబ్బులు దొబ్బేస్తాడు' అంటుంది షాన్‌తో.

ఆ చీరమ్మాయి కష్టాలు తెలీనట్లుగా ప్రశాంతంగా ఉంది. తనకంటే నాలుగైదేళ్ళు పెద్దదవచ్చు. కాని తన స్కిన్ కంటే ఆ అమ్మాయి చర్మం ఎంత బావుందో అనుకుంది. చీర కూడా. అలాంటిది ఎక్కడ అమ్ముతారో? తను వెళ్ళే షాపుల్లో కనిపించవు. 'లక్కీ ఫెలో' ఈర్ష్యగా అనుకుంది. షాన్‌గాడు ఈమెని చూస్తే కుక్కపిల్లలాగా వెనకే తిరుగుతాడు. ఆ ఊహ రాగానే ఆమె మీద అకారణ ద్వేషం కలిగి ముఖం తిప్పుకుని బయటకి చూడసాగింది.

★★★

తలుపుకి దూరంగా కూర్చున్న చిత్రాంగద ఆకుపచ్చ చీర కొంగు నేలమీద జీరాడుతూంటే పొందికగా కూర్చుంది. కళ్ళు చేతిలోని 'షూడాగ్' పుస్తకాన్ని చదువుతున్నా ఒక్క ముక్కా మనసుకి ఎక్కడంలేదు. 'ఎందుకిలా?' అనే ప్రశ్న ఆమెని వెంటాడుతోంది. ఆమెకి సిగ్గుగా అవమానంగా ఉంది. 'అతనెందుకు అలా అనేసాడు?' అప్రయత్నంగా అనుకుంది.

ఈ కాలం పిల్లల్లో తెలుగు పుస్తకాలు చదవడం అనే అరుదైన లక్షణం గల చిత్ర ఇండియా టిక్కెట్ కొనుక్కోగానే ఈసారి ఎలాగైనా తక్షశిలని కలవాలి అనుకుంది. అతనో రచయిత. అతను రాసే కథలు, ఓ దినపత్రిక సన్‌డే సప్లిమెంట్ సంపాదకుడుగా రాసే కాలమ్స్ వల్ల చిత్ర అతనికి అభిమాని అయింది. 'ఎంత బాగా రాస్తాడు? ఎంత సున్నితత్త్వం ఉంటుంది. అతని భావాల్లో భాషలో' అనుకుంటుంది. ఇండియా రాగానే తండ్రికి చెప్పింది. 'నాన్నా తక్షశిలగారి నంబర్ కావాలి. కనుక్కుంటావా?'

"తక్షశిల, నలంద ఏమిటమ్మా ఈ పేర్లు? అది నిజం పేరేనా?" ఆయన నవ్వి అడిగాడు.

"పెన్ నేం అనుకుంటానాన్న" చిత్రాంగద కూడా నవ్వి చెప్పింది.

ఆయన ఆ పత్రికాఫీసులో పనిచేసే మిత్రుడి ద్వార తక్షశిల పర్సనల్ నంబర్‌ని సంపాదించి అతనికి ఫోన్ చేసి పరిచయం చేసుకుని చెప్పాడు.

"మా అమ్మాయి అమెరికానించి వచ్చింది. ఇరవయ్యో తారీకు వెనక్కి వెళ్ళిపోతుంది. మీకు టైం ఉంటే కలవాలనుకుంటోంది. మీ రచనలన్నీ చదువుతుంది. మీ అభిమాని" ఆయన కూతురి నంబర్ ఇచ్చాడు.

తక్షశిల పావుగంట తర్వాత ఫోన్ చేసి 'గురువారం సాయంత్రం సెకండ్ కప్‌లో కలవమనండి' అని చెప్పాడు. అరుదుగా హైదరాబాద్ వచ్చే చిత్రాంగదకి అది ఎక్కడుందో తెలీదు. అడ్రస్ తెలుసుకుని వెళ్ళి ఆ సాయంత్రం తక్షశిల కోసం ఎదురు చూసింది.

అరగంట వేచి చూసాక అతను తలుపు తీసుకుని లోపలకి అడుగుపెట్టాడు. చాలాసార్లు అతని ఫొటో చూడడంతో ఆమె వెంటనే గుర్తుపట్టింది. అతను తనని గుర్తుపట్టడానికి వీలుగా ఫోన్ చేసింది. అతను చుట్టూ చూస్తే చిరునవ్వు నవ్వి కాల్ కట్ చేసింది.

తక్షశిల వచ్చి ఆమె ఎదురుగా కూర్చున్నాడు.

"నమస్తే. నేను చిత్రాంగద" చెప్పింది.

అతను ఆమె వంక నిశితంగా చూసి చెప్పాడు.

"మీ నాన్న మా అమ్మాయి అమెరికా నించి వచ్చింది. మీ ఫాన్ అంటే, స్టూడెంటేమో అనుకున్నా."

ఆ మాటలు చిత్రాంగదకి అర్థంకాలేదు. స్టూడెంట్ అనుకుని వచ్చాడా? తన వయసు తెలిస్తే వచ్చేవాడు కాదా అనిపించింది.

"స్టూడెంట్స్  తెలుగు న్యూస్ పేపర్లు చదవరేమోనండి. నేను రెగ్యులర్‌గా చదువుతాను కాబట్టి మీ గురించి తెలుసు" మెత్తగా చెప్పింది.

తక్షశిల భుజాలు ఎగరేసి చుట్టూ చూసి అడిగాడు.

"మీ నాన్న వచ్చారా?"

"రాలేదు. ఆయన పనులు ఆయనకి ఉంటాయి. నేను చిన్నపిల్లని కాదుగా వంటరిగా రావడానికి భయపడడానికి" చెప్పింది.

"చిన్నపిల్ల కాదు కాబట్టే" నవ్వాడు.

"నాకు అర్థం కాలేదు. అంటే?"

"నెవర్ మైండ్. వదిలేయండి. మీ వారేం చేస్తారు? సాఫ్ట్‌వేరా?"

"అవును"

"గూగులా? మైక్రోసాఫ్టా?"

"కాదు మాకు ఓన్ కంపెనీ ఉంది" చెప్పింది.

"మీరు? హౌస్ వైఫా? అంతేలెండి. లేకపోతే కథలు, కాకరకాయలు చదివే టైం ఎక్కడుంటుంది?" భుజాలు ఎగరేసి నవ్వాడు.

"మాకు కంపెనీ ఉందన్నాగా? మేమిద్దరం కలిసే పెట్టాం. నేను అడ్మినిస్ట్రేషన్‌లో ఉన్నా" చురుగ్గా చెప్పింది.

"ఓ. ఐతే సౌండ్ పార్టీనే" నవ్వాడు.

చిత్రకి ఆ సంభాషణ రుచించడంలేదు. అతనితో ఎన్నో మాట్లాడాలనుకుంది. అతని శైలి, శిల్పం, కథా వస్తువు ఎంపిక, పాత్రల ఔచిత్యం.. ఇంకా ఎన్నో. కాని అతను సాహిత్యం తప్ప అన్నిటి గురించి మాట్లాడుతున్నాడు.

అతని మేనరిజమేమో కాని మాటమాటికి భుజాలు ఎగరేస్తుంటే చూడ్డానికి ఇబ్బందిగా ఉంది.

"మీరు రాసిన 'వెన్నెల వేడెక్కింది' కథ నాకు చాలా ఇష్టమండీ, చాలా సహజంగా రాసారు" చెప్పింది.

తక్షశిల పెద్దగా నవ్వాడు.

"నేను హైద్రాబాద్ వచ్చిన కొత్తల్లో ఓ రూములో అద్దెకి ఉండేవాడిని. మా ఓనర్ పెళ్ళాం ఆకలి చూపులు చూస్తూండేది. మొగుడు సంపాదన రంధిలో పడితే పెళ్ళాం కోరికలతో వేడెక్కకుండా ఎలా ఉంటుంది చెప్పండి?" ముందుకి వంగి చెప్పాడు.

ఆ భాష ఆమెకి కర్ణ కఠోరంగా అనిపించింది. చక్కటి పదాలతో రాసే ఇతను వాడే ఈ మాటలేంటి? మొగుడు పెళ్ళాం ఇలాంటి కటువైన మాటలు విని చాలాకాలమైంది. ఆకలి చూపులు అంటాడేంటి? ఆవిడ పాపం మామూలుగా చూసేదేమో. దానికి కథ అల్లాడు అనిపించింది.

ఇండియా వెళ్ళినప్పుడు తక్షశిలని కలుస్తాను అనగానే విక్కీ అన్నమాటలు గుర్తొచ్చాయి.

"అతనికి లేడీస్ మీద సదభిప్రాయం లేదనుకుంటా చిత్రా. తనని తిరస్కరించిన ఆడవాళ్ళ గురించి ఇలా రాస్తున్నాడేమో అనిపిస్తుంది. నీ ఇష్టం."

తను విక్కీలా ఆలోచించలేదు అనుకుంది. ఆమెకి చటుక్కున మరో సంఘటన గుర్తొచ్చింది. ఓ ఫంక్షన్‌కి వెళ్ళినప్పుడు డెబ్బై దాటిన ఒకావిడ చెప్పింది.

"నాకు లవ్ స్టోరీస్ అంటే ఇష్టం. ఆ సిరీసే చూస్తాను టి.వి.లో. కొరియన్ లవ్ స్టోరీస్ బాగుంటై. పర్షియన్‌వి కూడా. అవి చూస్తుంటే ఏభై ఏళ్ళు వెనక్కు వెళ్తా."

ఇంటికి వచ్చాక ఆ విషయం విక్కీకి చెపితే చెప్పాడు "అందులో అంత ఆశ్చర్యపడాల్సింది ఏముంది? ఆవిడకి ప్రేమకథలు ఇష్టం. మా అమ్మ క్రైం సినిమాలు తప్ప మరోటి చూడదు. మినిమం రెండు హత్యలైనా ఉండాలి అంటుంది. మీ అమ్మకి హారర్. దెయ్యాలు,భూతాలు, హాంటెడ్ హౌసెస్ ఇష్టం. వాటి గురించి నువ్వెప్పుడూ ఆశ్చర్యపడలేదే? ఇదీ అలాంటి ఒక ఇష్టమే. పెద్దవాళ్ళు ప్రేమని  అసహ్యించుకోవాలి అంటావా?"

విక్కీ కున్న మంచితనం ఇతనిలో లేదు అనుకుంది.

తక్షశిల కాఫీ, మోమోస్‌కి ఆర్డర్ చేసాడు.

"అమెరికా నించి నాకేం తెచ్చారు?" అడిగాడు.

ఆ లేకితనానికి నిర్ఘాంతపోయింది.

పర్స్‌లోంచి మౌంట్ బ్లాంక్ పెన్ తీసిచ్చి చెప్పింది.

"మీరింకా ఎన్నో మంచి కథలు, కాలమ్స్ రాయాలని."

తక్షశిల తక్షం దానికి ఉన్న రేపర్‌ని చింపి టేబుల్ కింద పడేసి పెన్‌ని చూసి నిరాశగా చెప్పాడు.

"ఈ రోజుల్లో రాసేదేం లేదు. అంతా యూనికోడ్‌లో టైప్ కొట్టడమే."

ఆమె మరోసారి నిర్ఘాంతపోయింది.

తక్షశిల స్నాక్స్ తింటూ కాఫీ తాగుతూ తన ఆఫీస్ గురించి, మిత్రుల గురించి, తన వెంటబడే అమ్మాయిల గురించి అనర్గళంగా చెప్తూనే ఉన్నాడు. ఆ మాటల్లో బూతులు యదేచ్చగా దొర్లుతున్నాయి. చిత్రాంగద సిగ్గుపడిపోయింది.

అంతలో వాచ్‌మేన్ అతన్ని వెదుక్కుంటూ వచ్చి చెప్పాడు.

"మీ మోటర్ బైక్ ఓ కారుకి అడ్డంగా పెట్టారు సార్. వాళ్ళు కారు బైటకి తీయడానికి లేదు. ఓసారి వచ్చి బైక్ పక్కన పెడ్తారా? లేదా కీస్ ఇస్తే నేనే పెడతాను."

"ఏమనుకుంటున్నావురా? ప్రెస్ ఇక్కడ" తక్షశిల గర్జించాడు.

వాచ్‌మేన్ భయపడిపోయాడు. పబ్లిక్‌లో అంత పెద్దగా అరుస్తున్న అతన్ని చూస్తే చిత్రకి ఏవగింపు కలిగింది.

"వెళ్ళి పక్కన పెట్టి రావచ్చుగా? వాళ్ళు ఇబ్బంది పడుతున్నారు" మెల్లిగా చెప్పింది.

అతను చిరాగ్గా చూసి, వాచ్ చూసుకుని లేస్తూ చెప్పాడు.

"సరే చిత్రా. వెళ్ళొస్తా. నాకింకో అపాయింట్‌మెంట్ ఉంది. కవర్‌పేజ్ ఆర్టికల్‌కి ఇంటర్వ్యూ ఉంది. నీ నంబర్ ఉందిగా. మళ్ళీ మెసేజ్ చేస్తాలే."

హడావిడిగా వెళ్ళిపోయాడు.

చిత్రాంగద నివ్వెరపోయింది. తనని ఏకవచనంతో సంబోధించాడు. ఏమనుకున్నాడు తనని? మళ్ళీ ఏమని మెసేజ్ చేస్తాడు?

ఇలాంటి ధూర్తుడిని కలవడం తను చేసిన పెద్ద తప్పు అనుకుంది. విక్కి జడ్జిమెంట్ ఎప్పుడూ కరెక్టే. నిజమే ఇతనికి ఆడవాళ్ళ మీద గౌరవంలేదు. వాళ్ళతో మాట్లాడేప్పుడు బూతులు మాట్లాడకూడదని తెలీదు. ప్రెస్‌ని అడ్డం పెట్టుకుని తన కళ్ళముందే దబాయించాడు. అంటే తప్పులు చేసినా ఒప్పుకోని మనస్తత్వం. ఆమె స్థబ్ధుగా కూర్చుండిపోయింది.

వెంటనే ఇంటికి వెళ్ళాలనిపించలేదు. వెళ్ళగానే అమ్మ అడుగుతుంది, ఏం మాట్లాడావు అని. ఏం మాట్లాడింది తను? కింద పడ్డ గిఫ్ట్ రేపర్‌ని తీసి డస్ట్‌బిన్‌లో పడేసి చేతులు కడుక్కుని వచ్చి కూర్చుంది. టేబుల్ క్లీన్ చేయమని చెప్పి మరో కాఫీకి ఆర్డర్ చేసి పర్స్‌లోంచి ఫిల్‌నైట్ రాసిన షూడాగ్ పుస్తకం తీసి చదవసాగింది.

★★★

ఆమెకి ఎడమపక్క వరసలో కూర్చున్న సుమంత్ తన చేతిలోని మోకా కాఫీ కప్ వైపు చూసాడు. అతనికి దిగులుగా ఉంది. అసహాయత బలహీనుడ్ని చేస్తోంది. భయంగా ఉంది. రెండు రోజుల క్రితం దాకా అతని జీవితం నిర్విచారంగా సాగింది. తనేంటో, తన పనేంటో తప్ప అతను బయట ప్రపంచంతో ఎక్కువ సంబంధాలు పెట్టుకోలేదు. ఈ ప్రపంచంలో అతనికి అత్యంత ఆనందాన్నిచ్చేది, ముఖ్యమైంది కుటుంబమే. దానికి దూరమవడం అనే ఆలోచనే అతనికి వణుకు పుట్టిస్తోంది.

రెండు రోజుల క్రితం అతను కళ్ళు తిరిగి కిందపడ్డాడు. అరగంట దాకా ఒంటిమీద స్పృహలేదు. కాకపోతే ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. పెళ్ళికి వెళ్ళారు. లేస్తుంటే కళ్ళు తిరిగాయి. టైం చూసుకుని అరగంటపైనే స్పృహలో లేదని అర్థమవగానే భయపడిపోయాడు. డాక్టర్ దగ్గరకి వెళితే అనేక టెస్ట్‌లు చేసి చెప్పాడు.

"చాలా అనుమానాలు ఉన్నాయి. అన్నిటికీ ప్రిపేరై ఉండండి. రిజల్ట్స్ ఎల్లుండి సాయంత్రం వస్తాయి. అప్పటిదాకా జాగ్రత్తగా ఉండండి. డ్రైవ్ చేయద్దు. సెలవు పెట్టి ఇంట్లో ఉండండి"

ఆ మాటలు వినగానే సుమంత్‌కి మెదిలిన ఆలోచన కేన్సర్! మళ్ళీ స్పృహ తప్పినంత పనైంది. ఈ రెండురోజులు భయంగానే గడిపాడు. ఈరోజు ఇంట్లో ఉండాలనిపించక ఊబర్‌లో ఈ కాఫీ షాప్‌కి వచ్చి కూర్చున్నాడు. రెండు కాఫీలు తాగాక మరోసారి ఫోన్ చూసుకున్నాడు. లాబ్ రిపోర్ట్స్ ఇంకా రాలేదు.

తలుపుకి దగ్గరగా కూర్చున్న యువకుడ్ని చూసాడు. పదేళ్ళ క్రితం తనున్నట్లు ఉన్నాడు అనుకున్నాడు. సుమంత్ మనసులో బాధ సుళ్ళు తిరిగింది. పదేళ్ళ తర్వాత తను ఉంటాడో ఉండడో!

★★★

తలుపు దగ్గర కూర్చున్న గౌతమ్ చప్పుడైనప్పుడల్లా ఆశగా అటువైపు చూడసాగాడు. ఎవరెవరో వస్తున్నారు కాని అతను ఎదురు చూస్తున్న వ్యక్తి మాత్రం రావడంలేదు.

గౌతమ్ చేతులు ఒళ్ళో ఉన్న బేక్‌పేక్‌ని ఆప్యాయంగా భద్రంగా తడుముతున్నాయి. అందులో ఐదు లక్షల రూపాయలున్నాయి మరి.

చాలామంది మధ్యతరగతి కుర్రాళ్ళలా గౌతమ్ ది కూడా  నిరుద్యోగ సమస్య. సెకండ్ క్లాస్‌లో బి.టెక్ పాసైన గౌతమ్ పదిహేను వేల జీతానికి సిద్దమైనా ఆపాటి ఉద్యోగం కూడా దొరకలేదు. చివరికి ఓ స్నేహితుడు ముత్యం రాజు గురించి చెప్పాడు.

"ముత్యం రాజుగారు ముత్యంలాంటి మనిషి. ఆయన ఎంతమందికో ఉద్యోగాలిప్పించారు. నువ్వూ మీ నాన్నతో వెళ్ళి కలు. కనీసం నెలకి పాతికవేలు వచ్చే జాబ్ ఇప్పిస్తారు"

గౌతమ్ తండ్రితో కలిసి ముత్యం రాజుని చూడడానికి వెళ్ళాడు. ఆయన సూటిగా చెప్పాడు.

"ఫ్రీగా ఉద్యోగం ఇప్పించడానికి నువ్వేం నా మేనత్తా కొడుకువో, మేనమామ కొడుకువో కాదు కదా? ఏర్‌పోర్ట్‌లో వేకెన్సీలు ఉన్నాయి. నెలకి ముప్పై వేలదాకా ఇస్తారు. మీరు నాకు ఐదు లక్షలు ఇస్తే, నీకా ఉద్యోగం వచ్చేలా చేయగలను."

ఆయన బేరాలకి లొంగక ఐదు లక్షల దగ్గర స్థిరంగా ఉండిపోయాడు. చేసేది లేక గౌతమ్ తండ్రి ఊళ్ళో ఉన్న పాత ఇల్లు అమ్మి ఐదు లక్షలు తెచ్చి ఆయనకి ఫోన్ చేసాడు.

"మా ఇంటికి రావద్దు. వాడిని డబ్బు పట్టుకుని ఇవాళ సాయంత్రం ఐదింటికి సెకండ్ కప్‌కాఫీ షాప్‌కి రమ్మని చెప్పండి. మీరొద్దు" చెప్పాడు ముత్యం రాజు.

ఆ ప్రకారం గౌతమ్ నాలుగున్నర నించే అక్కడ ఆయనకోసం ఎదురు చూస్తున్నాడు. ఆరున్నరైనా ఆయన అంతులేదు. ఆకలిగా అనిపించి మెనూ కార్డ్ చూసాడు. ఆ రేట్లు చూస్తే భయం వేసి మళ్ళీ దాన్ని యధాస్థానంలో పెట్టాడు.

ఆయన వచ్చి కాఫీ తాగుతానంటే అందుకు సరిపడ డబ్బు తనదగ్గర ఉందా అని అతనికి అనుమానం వచ్చింది.

"ఏంట్రా గౌతమ్ ఇక్కడున్నావ్?"

పలకరింపు విని చూసాడు. తన క్లాస్‌మే కామేష్. కాఫీషాప్ యూనిఫాంలో ఉన్నాడు. అతని చేతిలో ఖాళీ కప్పులున్న ట్రే ఉంది.

"అరేయ్ కామేష్. నువ్విక్కడ పనిచేస్తున్నావా? జీతమెంతరా?" ఉత్సాహంగా పలకరించాడు.

కామేష్ వంగి గుసగుసగా చెప్పాడు.

"పదిహేనువేలిస్తారు. టిప్స్ కూడా వస్తాయ్ అప్పుడప్పుడు. మంచి జాబ్ కోసం ట్రై చేస్తూనే ఉన్నారా."

"లక్కీ ఫెలోవిరా గౌతమ్ అభినందనగా చెప్పాడు.

దియా టైం చూసుకుంది. ఏడవుతోంది. ఏమయ్యాడు ఈ షాన్‌గాడు?

'వెయిటింగ్ ఫర్ యూ బేబీ' మెసేజ్ చేసింది. సమాధానం లేదు. అప్రయత్నంగా డిస్‌ప్లే పిక్చర్ వైపు చూసింది. మురళి లేదు. బ్లాంక్‌గా ఉంది. అనుమానం వచ్చి మెసేజ్ చూసింది. సింగిల్ టిక్ ఉంది. 'బ్లాక్ చేసాడు!' అప్రయత్నంగా అనుకుంది.

ఆమె కళ్ళముందు కట్టాల్సిన ఫ్లాట్ అద్దె, చెల్లించాల్సిన క్రెడిట్ కార్డ్ బిల్స్ గిర్రున తిరిగాయి.

'మనసు విరిగిపోతే ఇక ఆ మనిషి మొహం చూడను' షాన్ ఏదో సందర్భంలో చెప్పింది గుర్తొచ్చింది.

లేచి బిల్లింగ్ కౌంటర్ వైపు వెళుతూ ఆకు పచ్చ చీరలోని అందగత్తెని అసూయగా చూసింది.

చిత్రాంగద పుస్తకం మూసి పర్స్‌లో పెట్టింది. నైకీ షూ ఇంత ప్రఖ్యాతి గాంచడానికి వెనకున్న ఎత్తుపల్లాల గురించి చదవడానికి ఇది సరైన ప్రదేశం కాదు అనుకుంది. పెద్ద పెద్ద సి.ఇ.వోలు, వ్యవస్థాపకులు తమ రంగాల్లో ఎంత కృషి చేస్తే, వ్యక్తిగత సమయాన్ని ఎంత కేటాయిస్తే ఈ స్థితికి రాగలిగారు?

తను తన మూడుగంటల విలువైన సమయాన్ని అర్హతలేనివాడి కోసం ఖర్చు చేయడం ఎంత తప్పు? ప్రొడక్టివ్‌గా కాకపోయినా కనీసం అమ్మ, అమ్మమ్మ దగ్గిర గడిపినా బావుండేది.

చీరని సర్దుకుని, పర్స్ చేతిలో పట్టుకుని చుట్టూ చూసింది. తనవైపే చూస్తున్న కామేష్ కనిపించాడు.

అతన్ని పిలిచి ఐదు ఐదువందల రూపాయల నోట్లిచ్చి చెప్పింది.

"బిల్ సరిపోతే ఓకే. తగ్గితే నాకు చెప్పు. మిగిలితే నువ్వు తీసుకో."

ఓ పది క్షణాలు వేచి చూసింది. బిల్లింగ్ కౌంటర్ దగ్గరున్న కామేష్ సరిపోయిందన్నట్లుగా తలూపాడు.

కారుని షాప్ ముందుకి తీసుకురమ్మని డ్రైవర్‌కి ఫోన్ చేసి చెప్పి బయటకి నడిచింది. వెళ్తున్న ఆమెవైపు సుమంత్ దిగులుగా చూసాడు. తన భార్యకూడా అలాగే ఉంటుంది. ఆమె జీవన విధానం కూడా ఇలాంటిదే. తనకేదైనా మందు లేని రోగం వస్తే ఆమె పరిస్థితి ఏమిటి?

ఫోన్ మోగింది డాక్టర్ నించి. వణికే చేతుల్తో ఆన్ చేసాడు.

సుమంతూ ఎప్పుడూ పనేనా? నీ గురించి పట్టించుకోవా? నీ బ్లడ్‌లో అసలు బి ట్వల్వ్ లేదు. అందుకే నీరసం, నిస్త్రాణ. మందుల పేర్లు వాట్సాప్ చేస్తా. కొని వాడుకో" ఆయన చెప్పాడు.

"స్కాన్...రిజల్ట్స్..: " సుమంత్ భయంగా అడిగాడు.

"అన్నీ బానే ఉన్నాయ్. ఒంట్లో విటమిన్స్ తక్కువగా వున్నాయ్." ఆయన ఫోన్ పెట్టేశాడు.

సుమంత్‌కి సినిమాల్లోలాగా లేచి డేన్స్ చేయాలనిపించింది. అతని మొహంలో సంతోషం చిందులు వేస్తోంది.

ఊబర్ కేబ్ బుక్ చేసుకుని, బిల్లు చెల్లించి బయటకి నడిచాడు.

ఏడు దాటినా ముత్యంరాజు రాకపోవడంతో గౌతమ్ కి ఏం చేయాలో అర్ధంకాలేదు. ఏర్‌పోర్ట్‌లో జాబ్ అని ఎన్ని కలలు కన్నాడు. ఆయన మర్చిపోయాడా? నాన్న పొద్దున ఫోన్ చేస్తే ఆయనేగా ఇక్కడికి రమ్మని చెప్పింది?

'కడుపు మండిన నిరుద్యోగి ఫిర్యాదుతో ముత్యంరాజుని....' టివిలో న్యూస్ రీడర్ చెప్పేది వినబడి టి.వి వంక చూసాడు. ముత్యంరాజుని పోలీసులు అరెస్ట్ చేసిన విజువల్స్ చూపిస్తున్నారు. నిరుద్యోగులకి ఉద్యోగం ఇప్పిస్తానని ఆశపెట్టి వారినించి డబ్బులు కాజేసిన నేరానికి ముత్యంరాజుని అరెస్ట్ చేసారు.

గౌతం దిగ్భ్రాంతి చెందాడు. ఏం చేయాలో తోచలేదు. కాళ్ళూ చేతులు వణుకుతున్నాయి. ఆయన్ని ఇవాళ కాక రేపు అరెస్ట్ చేస్తే? ఉన్న ఒక్క ఆస్తీ పోగొట్టుకుని, ఉద్యోగం లేక తాము ఏమయ్యేవారు? అతనికి ఒళ్ళు జలదరించింది.

బేక్‌పేక్‌ని జాగ్రత్తగా తగిలించుకుని లేచి కామేష్ దగ్గరకి వెళ్ళాడు.

"నాక్కూడా ఏదైనా పని ఇప్పించరా?" ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

"మాకు చాలా బ్రాంచ్‌లున్నాయిరా. ఏదో ఒక దాంట్లో ఇరికిస్తాలే. ఇది ప్రైం టైం కదా. బాస్ బిజీగా ఉంటారు. రేపు పదకొండుకి వస్తావా? పరిచయం చేస్తా. మరి బి.టెక్ చదివి సర్వర్ ఉద్యోగం అనుకోవుగా?"

"లేదు. లేదు. అనుకోను" గౌతం చెప్పాడు.

"ఐతే రేపు వచ్చెయ్" కామేష్ హామీ ఇచ్చాడు.

గౌతం ఆనందంగా బయటకి నడిచాడు.

సెకండ్ కప్ కాఫీషాప్ కస్టమర్స్‌తో కళకళ్ళాడుతోంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*